ఫుడ్ పాయిజన్‌పై పార్టీల ఆందోళన

- బీజేపీ, ఏబీవీపీ రాస్తారోకో, బీఆర్ఎస్ నిరసన
- ధన్వాడ బాలుర పాఠశాల వద్ద పోలీసు బందోబస్తు
- ఎస్ఐతో వాగ్వాదం

4



ధన్వాడలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ, ఏబీవీపీ నాయకులు

నాలుగు యుగాలు నాలుగు పేర్లు

- విశిష్ట, ప్రాచీన పుణ్య క్షేత్రం గంగాపురం
- ఆలయంలో కొలువుదీరిన చెన్నకేశవ స్వామి
- మాఘ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు బ్రహ్మోత్సవాలు

5



జడ్చర్ల మండలం గంగాపురం చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 108 కలశాలకు పూజ చేస్తున్న అర్చకులు

వైభవంగా వార్షికోత్సవాలు



స్వామి వారి ఆలయానికి పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న పాలక మండలి సభ్యులు

అలంపూరు జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఐదో శక్తిపీఠమైన జోగుళాంబ అమ్మ వారి వార్షికోత్సవాలు గురువారం వైభవంగా ప్రాంభమయ్యాయి. ఆలయ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఈవో పురేంధర్ కుమార్ అర్చకులతో కలిసి అమ్మవారి ఆలయం నుంచి పట్టు వస్త్రాలు తీసుకొని స్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. ఉత్సవాలకు స్వామి వారి ఆనతి స్వీకరణ చేశారు. అనంతరం అమ్మవారి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటలకు ధ్వజారోహణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలు ఐదు రోజుల పాటు కొనసాగుతాయని చివరి రోజు సోమవారం వసంత పంచమిని పురస్కరించుకొని జోగుళాంబ అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుందని ఈవో పురేంధర్ కుమార్ తెలిపారు.

'ఉపాధి' ఉద్యోగుల పోరుబాట

- అమలు కాని పే స్కేల్..
- ఏడాదికాలంగా ఎదురుచూపులు
- పదోన్నతులు, బదిలీలలో తాత్సారం
- మూడు నెలలుగా అందని వేతనాలు
- ఆందోళన కార్యక్రమాలకు ప్రణాళిక

మహబూబ్‌నగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అమలులో కీలకంగా పనిచే స్తున్న ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం పో రుబాటకు సిద్ధమయ్యారు. పేస్కేల్ గతేడాది ఫిబ్రవరి 2 నుంచి అమలు చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ కాకపోవడంతో ఆందోళన కార్యక్రమాలకు సన్నద్ధమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ పథకం కింద 638 మంది టెక్నికల్ అసిస్టెంట్లుగా, ఏపీవోలుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, ఇంజనీరింగ్ సలహాదారులుగా, మేనేజర్లుగా పనిచేస్తు న్నారు. ఐకేపీ సెర్ప్ ఉద్యోగులకు ఇప్పటికే పే స్కేల్ అమలవుతుండగా అదే తరహాలో తమకూ అమలు చేయాలని కోరుతున్నా వారి గురించి పట్టించుకునే పరిస్థితి లేక పోయింది. పే స్కేల్ అమలు కా కపోవడంతో పదోన్నతులు, ఇంక్రిమెంట్‌లు, బదిలీ విష యంలో ఇబ్బందులు వస్తున్నాయి. 2006 నుంచి ఏ కే డర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రస్తుతం 18 ఏళ్లుగా అదే కేడర్‌లో పనిచేస్తున్నారు. జీతాలు కూడా ఆశించిన మేర పెరగకపోవడంతో పే స్కేల్ అమలు చేయాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. 2024 ఫిబ్రవరి 2న జాతీయ ఉపాధిహామీ పథకం అమలు రోజున పేస్కేల్ అమలు చేస్తామని హామీ

- మిగతా 4లో..

ఉపాధి ఉద్యోగులకే ఉపాధి కరువైంది. ఏకంగా ఏడాది పాటు పే స్కేల్ అమలు కోసం ఎదురుచూపులే శరణ్యమయ్యాయి. గత మూడు నెలలుగా వేతనాలూ కరువయ్యాయి. ఎవరికి చెప్పుకోవాలో తెలియక పోరుబాటకు సన్నద్ధమమయ్యారు. ఇందుకు గాను ఆందోళన కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఉపాధి హామీ పథకం అమలులో వీరు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పథకం కింద 638 మంది పనిచేస్తున్నారు. పే స్కేల్ అమలు కాక పదోన్నతులు, ఇంక్రిమెంట్‌లు, బదిలీల విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 18 ఏళ్లుగా ఒకే కేడర్‌లో పనిచేస్తుండటం గమనార్హం. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

● అందని వేతనాలు

పే స్కేల్ కోసం ఓ వైపు పోరాడుతున్న ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వడం లేదు. పే స్కేల్ అమలు చేయకపోవడంతో ఆందోళనలో ఉన్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని వాపోతున్నారు. పేన పేర్కొన్న ఉద్యోగులతో పాటు ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న మరో 700 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కూడా మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. పే స్కేల్ ఇస్తే ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ట్రెజరీ ద్వారా జీతాలు విడుదల కానున్నాయి.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు(ఫైల్)

ఎస్సీ వర్గీకరణ కోసం ధర్మ పోరాటం

- 7న 'లక్ష డప్పులు- వేల గొంతులు' ప్రదర్శనను జయప్రదం చేయండి
- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు



నాగర్‌కర్నూల్ పట్టణంలో డప్పు కొడుతూ ర్యాలీ నిర్వహిస్తున్న మందకృష్ణ మాదిగ

నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల సర్కిల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోరుతున్న మాదిగలది ధర్మ పోరాటమని, దాన్ని వ్యతిరేకిస్తున్న వారిది స్వార్థమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన మాదిగల 'లక్ష డప్పులు వేల గొంతులు' ప్రదర్శనలో భాగం గురువారం నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో డప్పుల ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి బస్టాండు కూడలి వరకు ప్రదర్శనలో మందకృష్ణ మాదిగ డప్పు కొడుతూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు మాలలు తప్ప ఎస్సీల్లోని 57 ఉప కులాలు అనుకూలంగా ఉన్నాయన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తప్ప రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, కులాలు, సామాజిక సంఘాలు ఎమ్మార్పీఎస్ పోరాటాలకు అండగా నిలుస్తూ ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ కేంద్ర అధిష్ఠానంతో పాటు రాష్ట్రంలో రాజకీయంగా ఉన్నత స్థానంలో రెండు మాల కుటుంబాలు ఎస్సీ వర్గీకరణకు అడ్డుకుంటాయని ఆరో పించారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే అసెంబ్లీ సాక్షిగా స్వాగతించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థంకావడం లేదన్నారు.

ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా మాదిగలు రోడెక్కే పరిస్థితి వచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన జెట్టి ధర్మరాజు వంటి మాలలకు రాబోయే రోజుల్లో అండగా ఉంటామన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాదులో నిర్వహించనున్న లక్ష డప్పులు వేయి గొంతుల ప్రదర్శనలో జిల్లా నుంచి మాదిగలు, మాదిగ ఉప కులాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా రాత్రి గద్వాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి గద్వాల పట్టణంలో ర్యాలీగా వెళ్లి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు మంద కృష్ణకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గద్వాలకు వచ్చిన మంద కృష్ణ బాబు జగ్జీవన్‌రావు, డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఫోరం జాతీయ అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు, జైభీం దీక్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మంగి విజయ్, గూట విజయ్, కోళ్ల శివ, డప్పు కళాకారులు డప్పుస్వామి, గద్వాలలో శంకర్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌మాదిగ, పరశురాముడు, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పీయూ డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పీయూ అనుబంధంగా ఉన్న డిగ్రీ కళాశాల విద్యార్థుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను పీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్‌లో కలిసి గురువారం విడుదల చేశారు. ఫలితాలు ఇంకా మెరుగు పడాలని విద్యార్థులు తరగతులు హాజరయ్యే విధంగా చూడాలని వీసీ శ్రీనివాస్ అన్నారు. ఈ ఫలితాలలో మొదటి సెమిస్టర్ 32.61 శాతం, మూడవ సెమిస్టర్‌లో 37.75 శాతం, ఐదో సెమిస్టర్‌లో 48.81 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. మిగిలిన వారు ఎక్కువ శాతం పైతరగతికి ప్రమోట్ కాగా, మిగిలిన వారు ఫెయిల్ అయ్యారని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, అదనపు పరీక్షల నిర్వహణ అధికారులు డాక్టర్ శాంతి ప్రియ, అజ్మీ రా, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ అరుంధతి రెడ్డి ఉన్నారు.

బైలెల్లిన ఆదిపరాశక్తి

- డప్పుల దరువులు, పోతురాజుల విన్యాసాలతో ఈదమ్మ తల్లి ఊరేగింపు
- హాజరైన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు



కొల్లాపూర్ పట్టణంలో ఈదమ్మ తల్లి విగ్రహ ఊరేగింపు



కొల్లాపూర్‌లో ఈదమ్మదేవత విగ్రహం ఊరేగింపు, హాజరైన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, స్థానికులు

4

చోరీ కేసులో తండ్రీకొడుకుల అరెస్ట్

- విలేకర్ల సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వస్తున్న వ్యక్తితో మాటకలిపి రూ. లక్ష నగదును కాజేసిన తండ్రి, కొడుకును అరెస్ట్ చేసినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గద్వాల పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 21న శాంతినగర్‌లోని మానవపాడు మండలం మద్దూర్ గ్రామానికి చెందిన బాలాసాహెబ్ శాంతినగర్‌లోని యూనియన్ బ్యాంకులో కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు విడిపించుకోవడానికి లక్ష నగదుతో బైక్‌పై బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకు అధికారులు టెక్నికల్ సమస్య ఉందని చెప్పడంతో డబ్బులతో ఇంటికి వెళ్తున్న క్రమంలో ఒక వ్యక్తి అడ్రస్ అడుగుతూ.. మరో వ్యక్తి వచ్చి తన బైక్ కవరులో ఉన్న లక్ష నగదు తీసుకొని బైక్‌పై పారిపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి డీఎస్పీ మొగిలయ్య, సీఐ టాటాబాబు, ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో గురువారం మద్దూరు స్టేజీ సమీపంలో ఆ ఇదరిని అరెస్ట్ చేసి విచారించారు. బాలాసాహెబ్ డబ్బులు ఎత్తుకెళ్లింది వారే అని, ఇద్దరు తండ్రీ కొడుకులని, ఆంధ్రప్రదేశ్‌లోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బిట్రగుంట గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. తండ్రి పిట్ల శివకుమార్, ఆయన కుమారుడి (మైనర్) పై గతంలో కూడా పలు కేసులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్పీ సీఐ నాగేశ్వర్‌రెడ్డి, శాంతినగర్ ఎస్ఐ సంతోష్ ఉన్నారు.

అబద్ధపు హామీలతో.. అధికారంలోకి కాంగ్రెస్

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్
- నాగర్‌కర్నూల్ పట్టణంలో గాంధీ విగ్రహానికి వినతి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆచరణ సాధ్యం కాని అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో మేరకు గురువారం బైకని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ పట్టణంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని కోరారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీనిత్యం ప్రజలకు వంచిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలకు పాతరేసి ప్రజల అటెన్షన్ డైవర్షన్ డ్రామాలతో పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ కల్పన భాస్కర్‌గౌడ్, వైస్ చైర్మన్ బాబురావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశెట్టి శివకు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన దేశెట్టి శివ

కందనూలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ వేదికగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్స్‌లో 1500 మీటర్ల రన్నింగ్ రేసులో నాగర్‌కర్నూల్ జిల్లా ఏఆర్ విభాగానికి చెందిన దేశెట్టి శివ ఏఆర్ పీసీ 1339 గోల్డ్ మెడల్ సాధించారు. ఇతని స్వగ్రామం లింగాల మండలం రామాజీపల్లి. రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో గోల్డ్ మెడల్ సాధించిన దేశెట్టి శివను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రశంసించారు. మున్ముందు ఎన్నో మెడల్స్ గెలుచుకోవాలని ఆశీర్వదించారు.

బాధితులకు న్యాయం చేయాలి

● ఎస్పీ రావుల గిరిధర్



వనపర్తి క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలని, పోలీసులకు ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. వనపర్తి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లతో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో క్రమశిక్షణ తదితర అంశాల గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాధతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని సూచించారు. పోలీస్ శాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని, అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని, వృత్తిపరమైన జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ వనపర్తి జిల్లాకు, తెలంగాణ పోలీస్‌కు మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ శివకుమార్, జిల్లాలోని ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ ఉద్యోగుల పోరుబాట

(3వ పేజీ తరువాయి)


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఇచ్చారు. ఆరోజు ప్రకటన రాక పోగా, ఏడాదిగా ఉద్యోగులు సంబంధిత మంత్రులు, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

● ఆత్మీయ భరోసా అమలులో...

ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమం అమలుకు ఉపాధి హామీ పథకమే కీలకంగా ఉంది. భూమి లేని నిరుపేదలు ఉపాధి హామీ పథకంలో 20 రోజులు పని దినాలు చేసి ఉండాలన్న నిబంధన ఉండటంతో ఇన్నాళ్లు పనులకు రాని భూమిలేని నిరుపేదలు కూడా వస్తున్నారు. ఈ పథకంపై ప్రభుత్వం ప్రకటన చేసినప్పటి నుంచి నాటి నుంచి సెలవులు కూడా తీసుకోకుండా పని చేస్తున్నామని, సంబంధిత పథకం కోసం అర్హుల జాబితాలను తామే తయారు చేయాల్సి ఉండటంతో సంక్రాంతి పండగ వేళల్లోనూ పనిచేశామని, తమ సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

● పోరుబాటకు సిద్ధమైన ఉద్యోగులు

పే స్కేలు ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది కాలమైనా హామీని అమలు చేయకపోవడంతో ఉద్యోగులు తిరిగి తిరిగి వేసారి చివరకు పోరుబాటకు సిద్ధమయ్యారు. డ్యూటీ చేస్తూనే నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన 15 రోజుల నిరసన షెడ్యూల్‌ను రూపొందించారు.

● ఈనెల 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో పెన్‌డౌన్, షెట్‌డౌన్, 2న ఉపాధి హామీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజాప్రతినిధులను కలువడం, 3న స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల అందజేత, 4న జిల్లాల కలెక్టర్‌లకు వినతిపత్రాల అందజేత, 5న కలెక్టరేట్‌ల ముందు శాంతియుత నిరసన కార్యక్రమాలు, 6న జిల్లా ఎంపీడీవోలు, సీఈవో, టీఎన్జీవో, టీజీవో సంఘాలకు వినతులు సమర్పించడం, 7న ప్రజాభవన్‌లో వినతిపత్రాలు అందజేత, 8న పీఆర్ అండ్ ఆర్‌డి కమిషనర్‌కు వినతిపత్రం, 9, 10వ తేదీల్లో తెలంగాణ మంత్రులకు వినతిపత్రాల అందజేత, 11న సీఆర్‌డీ కార్యాలయంలో శాంతియుత నిరసన కార్యక్రమం, చివరకు ఈనెల 12న కమిషనర్‌కు నోటీసు ఇచ్చి సమ్మెకు దిగాలని నిర్ణయించారు.

అడ్డుకట్ట ఎక్కడ?

● విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్ల వ్యవహారం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో నిబంధనలకు అధికారులు తిలోదకాలు ఇస్తున్నారు. అసలు విద్యాశాఖలో ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు డిప్యుటేషన్, కానీ సర్దుబాటు కానీ చేయాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి. ఇతర జిల్లాలో డిప్యుటేషన్ కోసం అక్కడి జిల్లా ఉన్నతాధికారి సూచన మేరకే సర్దుబాటు కాని డిప్యుటేషన్ ఇచ్చారు. కానీ పాలమూరు జిల్లాలో మాత్రం జిల్లా విద్యాశాఖ అధికారికి గాని, కార్యాలయంలో ఉండే ఏడీ, సూపరింటెండెంట్స్ గాని ఏ టీచర్ ఎక్కడ పని చేస్తున్నారన్నది తమకు తెలీదని చెబుతుండటం గమనార్హం. అసలు జిల్లాలో ఏ ఒక్క టీచర్‌కు డిప్యుటేషన్ ఇవ్వలేదని విద్యాశాఖ కార్యాలయ వర్గాలు చెపుతున్నాయి. మండల విద్యాశాఖ అధికారులు చెప్పే మాట వింటే మరొక రకంగా ఉంది. సుమారు 20 మంది టీచర్లు డిప్యుటేషన్లలో ఉన్నారని చెపుతున్నారు. వారి వివరాలు చెప్పేందుకు కొందరు ఎంఈవోలు జంకుతున్నారు. డిప్యూటేషన్ ఉన్న వారి పేరు చెబితే మాకు ఇబ్బంది అవుతుందని కొందరు అంటుంటే.. మరికొందరు తాము బాధ్యతలు తీసుకోక ముందే ఇచ్చారని తెపుతున్నారు... కొందరి పేర్లను డీఈవో కూడా చెప్పడం లేదు అని ఓ మండల విద్యాశాఖ అధికారి చెపుతున్నారు. అంటే ఎంత గోప్యంగా ఈ డిప్యుటేషన్ల వ్యవహారం కొనసాగుతుందో అర్థం అవుతుంది.

మిడ్జిల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ స్కూల్ నుంచి జిల్లా కేంద్రంలోని బోయపల్లి ఉన్నత పాఠశాలకు ఓ ఆంగ్ల ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు. మరికొందరు టీచర్లు ఇతర మండలం నుంచి మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ మండలాల్లో కొనసాగుతున్నారు. బోయపల్లిలో పని చేసే ఆంగ్ల ఉపాధ్యాయుడు బీఎడ్ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల ప్రకారం పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులను ఎవ్వరిని కూడా బీఎడ్, డీఎడ్ కళాశాలలకు డిప్యుటేషన్ ఇవ్వకూడదన్న నిబంధనలు ఉన్నాయి. కేవలం డైట్, బీఎడ్ కళాశాలల్లో రిటైర్డ్ ఉపాధ్యాయులను, రిటైర్డ్ అధ్యాపకులతో పాటు నిరుద్యోగులను మాత్ర మే కళాశాలలో అధ్యాపకులుగా తీసుకోవాలి.. కానీ జిల్లాలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

● మండలాల వారీగా ...

మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆయా మండల విద్యాశాఖ అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం ఇలా ఉన్నాయి.. మిడ్జిల్ మండలం నుంచి బోయపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఒకరు, బాలానగర్ మండలం నుంచి ఎర్రవల్లి తండాలో ఒకరు డిప్యుటేసన్‌పై పని చేస్తున్నారు. బోయపల్లి ఉన్నత పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు బీఎడ్ కళాశాలలో పనిచేస్తున్నారు.

మరో నలుగురు అదే మండలంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. గండీడ్ మండల పరిధిలోని జానంపల్లి పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ మహబూబ్‌నగర్ మండలంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇదే మండలలలోని వివిధ పాఠశాలలకు నలుగురు ఉపాధ్యాయులకు డిప్యుటేషన్ ఇచ్చారు. మహమ్మదాబాద్ మండలంలో ఆరుగురు డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు. బాలానగర్ మండలంలోని నేలబండతండా నుంచి దేవరకద్ర మండలం పీఎస్ నాగారంలో డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు. మరో ఇద్దరు మండల పరిధిలోనే డిప్యుటేషన్ విధులు నిర్వహిస్తున్నారు. భూత్పూర్ మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు. దేవరకద్రలో నలుగురు డిప్యుటేషన్‌పై ఉన్నారు. హన్వాడ మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులు మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలోని బోయపల్లి పీఎస్, మరొకరు ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతుండగా, నలుగురు అదే మండలంలో డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు. జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్‌లో ఒకరు, అదే మండలంలో ఆరుగురు ఉన్నారు. బోయపల్లి పాఠశాలలోనే ముగ్గురు డిప్యుటేషన్‌పై పనిచేయడం విమర్శలకు తావిస్తోంది.

డిప్యుటేషన్ రద్దు చేయాలని ఆదేశించా



జిల్లా ఉపాధ్యాయులకు గతంలో డిప్యుటేషన్ ఇచ్చారు. డిప్యుటేషన్ ఎంత మంది ఉన్నారని వివరాలు తీసుకుని వారందరివి డిప్యుటేషన్ రద్దు చేస్తాం. వారి వారి ప్లేస్‌లకు పంపిస్తాం. వచ్చే విద్యాసంవత్సరంలో డిప్యుటేషన్ అవసరం ఉంటే కలెక్టర్ అనుమతితోనే ఇస్తాం. ఉపాధ్యాయులు కూడా బీఎడ్ కళాశాలలో చేస్తున్నారన్న విషయం తెలియదు. దీనిపై వివరణ తీసుకొని పాఠశాలకు పంపిస్తా. డిప్యుటేషన్ రద్దు చేయమని గతంలో నిర్వహించిన సమావేశంలోనే ఆదేశించాను. డిప్యుటేషన్ రద్దు చేయాలని ఉత్తర్వులు చేస్తాం.

-ఎ.ప్రవీణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి

● జిల్లాలో 20 మందికి పైగా అక్రమ డిప్యుటేషన్

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా 20 మందికి పైగా అక్రమ డిప్యుటేషన్స్ కొనసాగుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు చెపుతున్న లెక్కలు తేటతెల్లం చేస్తున్నాయి. ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో విద్యార్థులకు బోధన కుంటు పడకుండా మరో 70 మందికి పైగా ఉపాధ్యాయులు ఆయా మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు తెలుస్తున్నది. మరికొందరు ఎంఈవోలు వివరాలు చెప్పేందుకు అసలు ముందుకు రావడం లేదు. మేము ఎంఈవోలుగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఒక్క డిప్యుటేషన్ గాని, సర్దుబాటు గాని చేయలేదు. గతంలో ఇచ్చారు.. మాకు ఏమీ తెలియదంటూ సమాధానం చెపుతున్నారు.

ఇంత జరుగుతున్నా విద్యాశాఖ కార్యాలయంలో గాని జిల్లా విద్యాశాఖ అధికారి దగ్గర కనీసం ఒకరికి సంబంధించి వివరాలు లేవని విద్యాశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ శంభు ప్రసాద్ చెప్పడంపై పలు ఆరోపణలకు తావిస్తున్నాయి.

ఫుడ్ పాయిజన్‌పై పార్టీల ఆందోళన

» బీజేపీ, ఏబీవీపీ రాస్తారోకో, బీఆర్ఎస్ నిరసన
» ధన్వాడ బాలుర పాఠశాల వద్ద పోలీస్ బందోబస్తు
» ఎస్ఐతో వాగ్వాదం


అధికారులకు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధన్వాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ బాలుర పాఠశాలలో జరిగిన సంఘటనపై గురువారం ధన్వాడలో లొల్లి.. లొల్లి చోటుచేసుకున్నది. ఈ నేపథ్యంలో పాఠశాలలో పోలీస్ బందోబస్తును నిర్వహించారు. ఫుడ్ పాయిజన్‌పై చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన చోటు చేసుకుందని విమర్శించారు.

గంట పాటుగా రోడ్డుపై బైఠాయింపు జరిపారు. రాస్తారోకో విరమించాలని ఎస్ఐ రమేష్ ఆందోళనకారులను కోరడంతో కొద్ది సేపు ఎస్ఐతో వాగ్వాదం చోటుచేసుకుంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్ ఎలా జరిగిందని బీజేపీ, ఏబీవీపీ నాయకులు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నర్సింహ్మాచారిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంపై పాఠశాలలో గొడవ చోటుచేసుకోవడంతో ఎస్ఐ రమేష్, పోలీసులు సముదాయించారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఫుడ్ పాయిజన్‌పై నిరసన తెలిపారు. పాఠశాలను సందర్శించి ఫుడ్ పాయిజన్ గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న ఎంపీడీవో సాయిప్రకాష్, తహసీల్దార్ సింధూజ, ఎంఈవో గాయత్రిలను బీఆర్ఎస్ నాయకులు నిలదీశారు. అధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. అక్కడే ఉన్న ఓ విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం గురించి అధికారులు, బీఆర్ఎస్ నాయకులకు వివరించారు. తాగటానికి నీళ్లు సైతం ఉండవని విద్యార్థి అధికారులతో వాపోయారు.

ఓ విద్యార్థి తన బాధను వ్యక్తం చేస్తే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు.

రైతాంగం నిరీక్షణ

» జిల్లాకు అందిన రైతు భరోసా రూ.13.87 కోట్లు
» ఇంకా అందాల్సింది రూ.262 కోట్లు
» ముందుగా ఎంపిక చేసిన గ్రామాలకే అందిన రైతు భరోసా

నారాయణపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యాసంగి సాగుకు సమాయత్తం అవుతున్న జిల్లా రైతాంగానికి అందని రైతు భరోసా కోసం నిరీక్షిస్తున్నారు. అయితే ప్రభుత్వం ముందుగా ప్రతీ మండలంలో ఎంపిక చేసిన ఒక గ్రామానికి రైతు భరోసాను అందించింది. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఈసారి రైతు భరోసాను మొదటి విడతలో ఎకరాకు రూ. ఆరు వేల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గి మండలం చంద్రవంచలో ఈ నెల 26న నాలుగు ప్రభుత్వ పథకాలు ప్రారంభించగా అందులో ఒకటైన రైతు భరోసా ఈ నెల 27న ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల ఖాతాలో పడ్డాయి.

జిల్లా వ్యాప్తంగా 9,348 మంది రైతులకు రూ. 13.87 కోట్లు ఖాతాల్లో ప్రభుత్వం వేసింది. ఇంకా జిల్లా వ్యాప్తంగా 1,84,672 మంది రైతులకు రూ.262 కోట్లు అందని భరోసా కోసం రైతాంగం నిరీక్షణ చేస్తుంది. అధిక మొత్తంలో జిల్లా రైతాంగానికి రైతు భరోసా అందడంలో జాప్యం జరుగుతుండటంతో ప్రస్తుతం యాసంగి రబీ వరి సాగుకు పెట్టుబడి సహాయం సకాలంలో అందకపోతే ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా అందించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నా అది కూడా కొందరి రైతులకే ఎంపిక చేసిన గ్రామాలకు వేసి మిగతా గ్రామాలకు వేయకపోవడం తగదని అంటున్నారు.

ఏకకాలంలో రైతాంగానికి రైతు భరోసా ప్రభుత్వం వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం దశలవారిగా రైతాంగం అందరికీ రైతు భరోసా వేస్తుందని వ్యవసాయ అధికారులు చెప్పుకొస్తున్నారు.

పేట జిల్లాలో రైతు భరోసా అందిన గ్రామాలు

మరికల్ మండలం పల్లెగడ్డ, కృష్ణ మండలం అలంపల్లి, మద్దూర్ మండలం దోరెపల్లి, ఊట్కూర్ మండలం కొల్లూరు, నారాయణపేట మండలం అప్పంపల్లి, మాగనూర్ మండలం అడవిసత్యారం, మక్తల్ మండలం గోల్లపల్లి, గుండుమాల్ మండలం మద్దిరెడ్డిపల్లి, నర్వ మండలం బెక్కర్‌పల్లి, కొత్తపల్లి మండలం గోకుల్‌నగర్, ధన్వాడ మండలం కంసాన్‌పల్లి, దామరగిద్ద మండలం గత్ప, కోస్గి మండలం చంద్రవంచ ఎంపిక చేసిన గ్రామాల రైతాంగానికి రైతు భరోసా అందింది.

ఏకకాలంలో రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి



ఏకకాలంలో రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి. గతంలో తెలంగాణా రైతాంగానికి మొత్తం ఒకేసారి రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. అయితే ఈసారి సంవత్సరమైనా రైతులందరికీ రైతు భరోసా అందక ఎదురు చూస్తున్నారు. మండలానికి ఒక గ్రామం ఎంపిక చేసి రైతులకు ఇవ్వడం సమంజసం కాదు. వెంటనే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి.

- వెంకోబా, బీకేఎస్ పాలమూర్ జోనల్ కార్యదర్శి, నారాయణపేట


గాంధీ జీవితం ప్రతీ తరానికి స్ఫూర్తి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి


గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జీవితం ప్రతీ తరానికి స్ఫూర్తి అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో అహింసను పాటించిన వ్యక్తి మహాత్మాగాంధీ ఒక్కరే ఉండవచ్చు అని అన్నారు. అహింసను ఆచరించాలంటే గొప్ప నమ్మకం, ధైర్యం కావాలని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీ పాత్ర ఎనలేనిదని కీర్తించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సెల్ అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి కమర్‌మియా, వనపర్తి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోట్ల రవి, మునిసిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ బి.కృష్ణ, ఆవుల చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ నాయకులు న్యాయవాది బాబా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


పెబ్బేరులో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న రావుల చంద్రశేఖర్‌రెడ్డి

పెబ్బేరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం న్యూ కేటగిరి విభాగంలో నిర్వహిస్తున్న పోటీలను మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో తోడుగా ఉండే ఎద్దుల ప్రాముఖ్యతను తెలిపేందుకు ఈ పోటీలు నిదర్శనమన్నారు. పోటీలను తిలకించేందకు ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జగన్నాథంనాయుడు, మునిసిపల్ మాజీ చైర్మన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, చిదంబర్‌రెడ్డి, రాములు యాదవ్, రైతు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 22 గొర్రెలు మృతి

బాలానగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌతాపూర్‌లో గురువారం ఉదయం కుక్కల దాడితో 22 గొర్రెలు మృతి చెందినట్లు గొర్రెల కాపరులు నర్సింహయాదవ్, శ్రీశైలంయాదవ్ తెలిపారు. తాము తీవ్రంగా నష్టపోయామని గొర్రెల విలువ రూ.1.50లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


కొల్లాపూర్‌లో డప్పుల దరువులతో ఈదమ్మ తల్లి విగ్రహం ఊరేగింపు


ఈదమ్మ తల్లి విగ్రహం ఊరేగింపులో మహిళల కోలాటాలు

బైలెల్లిన ఆదిపరాశక్తి

● డప్పుల దరువులు, పోతురాజుల విన్యాసాల నడుమ ఊరేగింపు



కొల్లాపూర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణ ప్రజల ఆరాధ్య దైవం, ఆదిపరాశక్తి ఈదమ్మ తల్లిని గురువారం డప్పుల దరువులతో పురవీధుల్లో ఊరేగించారు. కొల్లాపూర్ పట్టణ శివారులో ఈదమ్మ ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం కొల్లాపూర్ పట్టణంలోని మాధవ స్వామి దేవాలయం నుంచిఈదమ్మ దేవత బైలెల్లింది. డప్పు దరువులు, పోతురాజుల నృత్యాల నడుమ భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా ఈదమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నది. ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావులతో పాటు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం ఆలయ శుద్ధి, యంత్ర ప్రతిష్ఠ, దేవతామూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమాలను పురోహితులు ఘనంగా నిర్వహించారు. నేడు ఉదయం 9:53 గంటలకు ఈదమ్మ తల్లి దేవాలయంలో విగ్రహపునఃప్రతిష్ఠ ఘనంగా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మాజీ ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజర వుతారని ఈదమ్మ తల్లి దేవాయం పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు

గద్వాల సర్కిల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులని మహబూబ్‌నగర్ డైట్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గద్వాలలోని బాలభవన్‌లో గురువారం ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారి ఉన్నత లక్ష్యాల ఛేదనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి ఎస్తేర్‌రాణి, ఆర్పీలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్యామలదేవి నవరాత్రులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసకాలనీలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం అమ్మవారిని లఘు శ్యామల దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ శ్యామల నవరాత్రులు గురువారం నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జోరుగా ధాన్యం క్రయ, విక్రయాలు

దేవరకద్ర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కొనసాగుతోంది. గురువారం పెద్దసోనా గరిష్ఠంగా రూ.2,511, కనిష్ఠంగా రూ.2,510, కందులు గరిష్ఠంగా రూ.7,186, కనిష్ఠంగా రూ.6,500 ధర పలికింది. పెద్దసోనా ఆరు, కందులు 62 క్వింటాళ్లు అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

కల్యాణ మండప నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం

భూమిపూజ చేసిన రాయచూర్ ఎమ్మెల్యే

కేటీదొడ్డి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలోని కొండపై వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో గురువారం కల్యాణ మంటపం నిర్మాణానికి ఆలయ పెద్దలు దాతల సహకారంతో భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటకలోని రాయచూర్ రూరల్ ఎమ్మెల్యే బసన్‌గౌడ్ దద్దల్ హాజరయ్యారు. ముందుగా అర్చకులు, ఆలయ పెద్దలు, గ్రామస్థులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం రాయచూర్ రూరల్ ఎమ్మెల్యే చేతుల మీదుగా కల్యాణమండపం నిర్మాణానికి భూమిపూజ చేయించారు. ఈ సందర్భంగా రాయచూర్ రూరల్ ఎమ్మెల్యే బసన్‌గౌడ్ దద్దల్ కల్యాణ మంటపం నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చి స్వామివారి పట్ల తన భక్తిని చాటుకున్నారు. ఆలయ పెద్దలు, గ్రామ పెద్దలు రాయచూర్ రూరల్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి శాలువ, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు శేషిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం

పదర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పదర మండలంలోని వంకేశ్వరం గ్రామంలో గంధోత్సవ వేడుకలు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద గుసుల్ తీసి ప్రార్థనలు చేశారు. అదే గ్రామానికి చెందిన భక్తురాలు పుల్లమ్మ ఇంటి నుంచి అశ్వ వాహన మీద పూలు, గంధం, హుక్కా, గుళాళ్, అత్తరు, పన్నీరు తదితర సుగంధ ద్రవ్యాలతో కూడిన దట్టి జెండాలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గుర్రాలతో నృత్యాలు, కోలాట బృందాలు ఆకట్టుకున్నాయి.

నేడు కందూరు జాతర

గ్రామ శివారులో ఉన్న సైదులు బాబా సన్నిధికి చేరిన గంధం అనంతరం శుక్రవారం కందూరు చేసి ఫాతేహా ఇస్తారు. భక్తులు గోధుమ పిండి, రొట్టెలు, ఆవు నెయ్యి, బెల్లం, యాలకులతో మలీజ అనే ప్రత్యేక నైవేద్యం చేసి దర్గాలో సమర్పించుంటారు. కొంత మంది మొక్కులు చెల్లించుకునే భక్తులు లాడేలు కట్టుకుంటారు. భక్తులకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు అనిత, తిరుపతయ్య, ఉషావరుణ్, మౌనిక, వెంకట్ తెలిపారు.

ఉద్యోగం పేరుతో డబ్బులు వసూలు


గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

గద్వాల క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో స్వీపర్, సెక్యూరిటి గార్డు, పేషంట్ కేర్ ప్రొవైడర్‌గా ఉద్యోగాలు చేయాలంటే డబ్బులు ఇవ్వాల్సిందే. అంతేకాకుండా వారికి పూర్తిగా అటెండెన్స్ వేసి సిబ్బంది రాని పనిరోజులకు సంబంధించిన డబ్బులను అతడే మెక్కేస్తున్నాడు. అయితే ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు ముఖ్యమైన ఇద్దరు సిబ్బందికి కూడా పంపకాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ కాంట్రాక్ట్ సిబ్బంది (సూపర్‌వైజర్) ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కో పోస్టుకు రూ. 60 వేల నుంచి లక్ష రూపాయల దాకా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉనన్నాయి. ఇటీవలే అక్కడే స్వీపర్‌గా ఉన్న ఓ వ్యక్తికి సంబంధించి బంధువుకు మెడికల్ కళాశాలలో కాని, ప్రభుత్వ ఆసుపత్రిలో కాని స్టాఫ్‌నర్స్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.30 వేలు తీసుకున్నట్లు బాధితుడు వాపోతున్నాడు ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులను ఇవ్వకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. కొన్నిరోజుల క్రితం గద్వాలకు చెందిన ఇద్దరు మహిళల నుంచి రూ. 60 వేల చొప్పున డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇప్పించినట్లు తెలుస్తోంది. వీరితో పాటు దాదాపు 15 నుంచి 20 మంది డబ్బులు తీసుకొని కొందరికి మాత్రమే ఉద్యోగం ఇప్పించి మిగిలిన వారికి ఇప్పించకపోవడంతో ఆసుపత్రిలోని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సిబ్బంది హాజరు నమోదుకు రెండు రిజిస్టర్లు నడుపుతున్నట్లు సమాచారం. డుమ్మా కొట్టిన ఉద్యోకి ఒక రిజిస్టర్‌లో గైర్హాజరు వేసి మరో రికార్డులో హాజరు వేస్తున్నారని, పూర్తిహాజరు నమోదు చేసిన రిజిస్టర్‌ను మాత్రం సంబంధిత కాంట్రాక్టర్‌కు పంపించి డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

ఈ విషయాలు మా దృష్టికి రాలేదు. ఒకవేళ అలా వస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. కార్మికులకు సంబంధించి ఇంతవరకు అందరికి మేము పూర్తి జీతాలు ఇస్తున్నాం. అక్కడ కోత విధిస్తున్న విషయం మాకు తెలియదు. కార్మికులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

- తరుణ్, కాంట్రాక్టర్, హైదరాబాద్

సమస్య మా దృష్టికి రాలేదు

ఈ విషయాలు మాకు సంబంధించినవి కాదు. మా దృష్టికి రాలేదు. సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఉపయోగించుకుంటాం. వారి జీతాలకు సంబంధించి మాకు సంబంధాలు ఉండవు.

-డాక్టర్ వినోద్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్

టీడీసీఏ టోర్నీలో రన్నర్‌గా పాలమూరు



ఉమ్మడి పాలమూరు జట్టుతో శాట్ మాజీ చైర్మన్, టీడీసీఏ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని దోమలగూడలో నిర్వహించిన తెలంగాణ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అంతర్ జిల్లా టీ-20 క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టీడీసీఏ లెవెన్ జట్టు 13 పరుగుల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలిచి చాంపియన్‌గా నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన టీడీసీఏ లెవెన్ జట్టు 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. జట్టులో మహేష్ జూదర్ సెంచరీ (102)తో రాణించాడు. జిల్లా బౌలర్లలో రవితేజ రెండు, దీక్షిత్ పాటిల్ ఒకటి, శశి ఒక వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌గర్ జట్టు 19.3 ఓవర్లలో 169 పరుగులకు కుప్పకూలింది. సంజు 41, వీరేందర్ 27 పరుగులు చేశారు. టోర్నీలో క్రీడాకారుడు రవితేజ అల్‌రౌండర్‌గా, బెస్ట్ కీపర్‌గా వీరేందర్ ఎంపిక య్యారు. విజేత, రన్నర్ జట్లకు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్, టీడీసీఏ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వరెడ్డి ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు నవాజ్, శ్రీనివాస్‌రెడ్డిలను ఉమ్మడి జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్ అభినందించారు.

సరికొత్త హంగులతో హీరో డెస్టినీ -125

» మహబూబ్‌నగర్ మార్కెట్లో విడుదల



హీరో డెస్టినీ - 125 స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్

పాలమూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు విపణిలోకి హీరో డెస్టినీ-125 స్కూటర్‌ను గురువారం అశ్వినీ హీరో షోరూం యజమాని దిలీప్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన డెస్టినీ-125 ప్రత్యేకతలను వివరించారు. ఎల్ఈడీ హెడ్‌లాంప్, డిజిటల్ మీటర్, బ్లూటూత్ కనెక్టివిటీతో జీపీఎస్ నావిగేషన్ సిస్టమ్ ఉంటుందని తెలిపారు. ఆటోక్యాన్సల్ వింకర్స్, కిలోమీటర్ రేంజ్‌ను చూపించే అడ్వాన్స్ ఫీచర్స్ లాంగ్ సీట్ ఉంటాయని చెప్పారు. 18 లీటర్ల బూట్‌స్పేస్, అధిక లెగ్ రూమ్ స్పేస్‌తో పాటు మొబైల్ చార్జింగ్ సౌకర్యం ఉందన్నారు. ఈ మోడల్ మూడు వేరియంట్లలో, ఏడు రంగుల్లో లభ్యం అవుతున్నట్లు తెలిపారు. ఈ వాహనం ఎక్స్‌షోరూం ధరలు వీఎక్స్ రూ.82,192, జెడ్ఎక్స్ 91,042, జెడ్ఎక్స్ ప్లస్ రూ.92,042గా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎంహెచ్‌డీ ఒబేదుల్లా కొత్వాల్ ఈ వాహనాన్ని నడిపి అనుభవాలను షోరూం యజమానితో పంచుకున్నారు. కార్యక్రమంలో మెకానిక్‌ల సంఘం పట్టణ అధ్యక్షుడు సిద్ధేశ్వర్, బాలరాజు, రమేశాచారి, వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నాలుగు యుగాలు నాలుగు పేర్లు

» విశిష్ట, ప్రాచీన పుణ్య క్షేత్రం గంగాపురం » ఆలయంలో కొలువుదీరిన చెన్నకేశవ స్వామి

» మాఘ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు బ్రహ్మోత్సవాలు

జడ్చర్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నాలుగు యుగాల్లో నాలుగు పేర్లతో విరాజిల్లిన ప్రముఖ పుణ్య క్షేత్రం గంగాపురం. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలో చెన్నకేశవ స్వామి కొలువుదీరిన ఈ క్షేత్రం కృతయుగంలో మత్స్యపురిగా, త్రేతాయుగంలో దురితకోలాహలంగా, ద్వాపరయుగంలో మాయాపురంగా, కలియుగంలో గంగాపురంగా పేరు గాంచినట్లు స్కంద పురాణ కథనం. ఇక్కడ ప్రతీ సంవత్సరం మాఘమాస పాడ్యమి నుంచి నవమి వరకు అంగ రంగ వైభవంగా నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభం అయ్యాయి.

గంగాపురం నుంచి గండకాద్రికి స్వామి

ఈ క్షేత్రంపై ఆసక్తికర కథనం ప్రచారంలో ఉంది. ద్వాపరయుగంలో మయుడి కుమారుడైన దుర్జయుడు గండకాద్రి అనే పట్టణాన్ని ధ్వంసం చేశాడు. అక్కడి మునులు గంగాపురం క్షేత్రానికి వచ్చి, వీరనారాయణ స్వామిని వేడుకున్నారు. దీంతో స్వామి గండకాద్రికి



ఆలయంలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి

వెళ్లి దుర్జయుడిని వధించి పట్టణాన్ని పునరుద్ధరించి అక్కడే నిలిచిపోయాడు. కలియుగ ఆరంభంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించే పుణ్యశీల మహరాజుకు స్వామి కలలో కనిపించాడు. మునుల కోరిక మేరకు గండకాద్రిలో కొలువై ఉన్నానని, మళ్లీ గంగాపురం గ్రామానికి రానున్నట్లు వెల్లడించారు. అక్కడి నుంచి స్వామి విగ్రహాన్ని తీసుకొచ్చి, గంగాపురంలో ప్రతిష్ఠించాలని, చెన్నకేశవస్వామిగా భక్తుల పూజలందుకుంటానని తెలిపారు. దీంతో పుణ్యశీల మహారాజు స్వామి విగ్రహాన్ని అక్కడి నుంచి గంగాపురం క్షేత్రానికి తీసుకొచ్చి ప్రతిష్ఠించి, ఆలయం నిర్మించారు.

పునర్నిర్మించిన త్రైలోక్యమల్ల సోమేశ్వరుడు

కాలక్రమంలో శిథిలమైన గంగాపురం దేవాలయాన్ని 1042 నుంచి 1062 సంవత్సరాల మధ్య త్రైలోక్య మల్ల సోమేశ్వరుడు అనే చాళక్యరాజు సుందర శిల్పాలతో పునర్నిర్మించారు. గ్రామానికి నైరుతి దిశలో రెండు ప్రాకారాలతో, ఎత్తయిన వేదికపై తూర్పు ముఖంగా ఏక కూటాలయ వాస్తురీతిలో ఆలయాన్ని నిర్మించారు. మొదటి ప్రాకారంపై శిల్పాలు, ప్రవేశ ద్వారానికి నగిశీలతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు స్తంభాలతో కృష్ణ మండపం, అంజలి ఘటిస్తున్న ఆంజనేయస్వామి విగ్రహంతో దేవాలయం, రాతిమెట్లతో పుష్కరణిని నిర్మించారు. అప్పటి నుంచి 15వ శతాబ్దం వరకు స్మార్థాగమ విష్ణు పంచాయతన సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించారు. ఆ తర్వాత శ్రీవైష్ణవ పంచరాత్రాగమ విధానంలో నిత్య పూజలు, బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

అందరి సహకారంతో ఉత్సవాలు



అన్ని శాఖల అధికారుల సమన్వయంతో లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, ఆలయ ట్రస్టు సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించాం. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అవసరమైన వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేశాం.

- దీప్తిరెడ్డి, ఈవో

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

గంగాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వ హించే 108 కలశాలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి పుణ్యాహవాచ నము, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండున తిరుకల్యాణం, మూడున పుష్పరథం (చిన్నతేరు), నాలుగున రథ సప్తమిని పురస్కరించుకొని రథోత్సవం (పెద్దతేరు) నిర్వహించనున్నారు. ఐదున శకటోత్సవం, ఆరున చక్ర తీర్థం కార్యక్రమాలను ఉంటాయని ఈవో దీప్తిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు కేశవాచారి, ట్రస్టు సభ్యులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, మల్లి కార్జున్, బ్రహ్మలింగం, గోపాల్‌యాదవ్, జంగయ్య, విశ్వంగుప్త, భీమస్వామి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వసంత పంచమి ఉత్సవాలు ప్రారంభం

» మాణిక్యగిరిలో భక్తిశ్రద్ధలతో యజ్ఞం

» ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



వీరధర్మజ మాత పాదకులకు ప్రత్యేక పూజలు చేస్తున్న శివయ్యస్వామి

దామరగిద్ద, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం, కలబరిగి జిల్లా సేడెం తాలుకా, యానగుంది మాణిక్యగిరి సూర్యనంది క్షేత్రంలో వసంత పంచమి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. మాణిక్యగిరి ట్రస్టు కార్యదర్శి శివయ్య స్వామి ఆధ్వర్యంలో గురువారం నుంచి వచ్చే సోమవారం వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం భక్తి శ్రద్ధలతో 29 గుండాలతో మహా యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమానికి కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి దంపతులు, భక్తులు తరలివచ్చారు. అంతకు ముందు ట్రస్టు కార్యదర్శి నేతృత్వంలో ధ్వజారోహణం, మాణికేశ్వరీ మాత పాదకులకు ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్రంలోని శివుడు, వెంకటేశ్వర స్వామి, సిద్దేశ్వరం, వీరబ్రహ్మేంద్ర, బ్రహ్మ, సరస్వతి, భవానీ మాత, ఆంజనేయ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కళాశాలకు వెళ్లిన విద్యార్థిని ఇంటికి తిరిగి రాలేదు. ఈ విషయంపై ఎస్ఐ గోవర్ధన్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఈదమ్మ గుడి ప్రాంతానికి చెందిన కుట్ర స్వాతి(20) జిల్లా కేంద్రంలోని సాధన డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 25వ తేదీన కళాశాలకు వెళ్లిన విద్యార్థిని ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ఇళ్లల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అధిక వడ్డీ పేరుతో రూ. 2.15 లక్షలు స్వాహా

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అధిక వడ్డీ పేరుతో సైబర్ నేరగాళ్లు డకెట్ లైన్ అనే యాప్ ద్వారా రూ. 2.15 లక్షలు స్వాహా చేశారు. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌కాలనీకి చెందిన బట్టు రాజశేఖర్ అధిక వడ్డీ వస్తుందన్న ఆశతో డకెట్ లోన్ యాప్‌లో రూ. 2.15 లక్షలు జమ చేశాడు. కానీ డిసెంబరు 17వ తేదీన ఆ యాప్ బంద్ కావడంతో దిక్కు తోచని స్థితిలో గురువారం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి న్యాయాధికారి జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ మండలంలోని బొందలపల్లి గ్రామానికి చెందిన కార్తీక్ ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. నిందితుడు గురువారం నాగర్‌కర్నూల్ కోర్టులో హాజరు పరిచారు. అతడికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు, రూ. 2200 జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మౌనిక తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు.

మందపైకి దూసుకెళ్లిన డీసీఎం

» ఎనిమిది గొర్రెలు మృతి

లింగాల, జనవరి 30 : (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండల పరిధిలో గొర్రెల మంద పైనుంచి డీసీఎం దూసుకెళ్లడంతో ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. కాపరి బాలపీరు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొల్లాపూర్ మండలం కుడికిల్ల గ్రామానికి చెందిన బాలపీరు అనే వ్యక్తి గురువారం రెండు వందల గొర్రెలను మేత కోసం లింగాల వైపు తీసుకెళ్తున్నాడు. అంబట్‌పల్లి నుంచి యాపట్లకు వెళ్లే దారిలో లింగాల వైపు నుంచి ధాన్యం లోడుతో ఎదురుగా వస్తున్న డీసీఎం అదుపు తప్పి మందపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఎనిమిది గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. మరికొన్ని గొర్రెలకు కాళ్లు విరిగాయి. వాటి విలువ దాదాపు రూ. 1.50 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అయోధ్య వద్ద రోడ్డు ప్రమాదం

» వనపర్తి జిల్లావాసులు ఇద్దరికి గాయాలు

అమరచింత, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, అయోధ్య పట్టణ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వనపర్తి జిల్లా, అమరచింత మండలం, పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు గాయపడ్డారు. హైదరాబాద్‌లో పండ్ల వ్యాపారం చేసే మండలంలోని పామిరెడ్డిపల్లి, ఈర్లదిన్నె, మూలమల్ల గ్రామాలకు చెందిన పలువురితో పాటు, గద్వాల, అయిజ, శాంతినగర్‌లకు చెందిన వారు ఈనెల 25న మినీ బస్సులో కుంభమేళాకు వెళ్లారు. అక్కడి నుంచి అయోధ్యకు వెళ్తుండగా, 20 కిలో మీటర్ల దూరంలో వీరు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో అమరచింత మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మోహన్, మల్లేశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరినీ అక్కడి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు తోటి ప్రయాణికుల ద్వారా తెలిసింది. వారి పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం.

విద్యార్థిని తీవ్రంగా కొట్టిన ఉపాధ్యాయురాలు

» పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

అయిజ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థిని ఉపాధ్యాయురాలు తీవ్రంగా కొట్టింది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో జరిగింది. పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో విరాట్ శంకర్ నాయక్ రెండవ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఆ విద్యార్థి అల్లరి చేశాడనే నెపంతో ఉపాధ్యాయురాలు మానస అతడిని శరీరంపై వాతలు వచ్చేలా కొట్టింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు జ్యోతి, కృష్ణనాయక్‌లు గురువారం అయిజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి తల్లి గట్టు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో పని చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసాచారిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తీవ్రంగా కొట్టటం తప్పే అని కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల విద్యాధికారి రాములును వివరణ కోరగా ఉన్నధికారుల ఆదేశం మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

లేగదూడను చంపిన చిరుత

కొత్తపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామంలో ఓ లేగ దూడను చిరుత చంపింది. బాధిత రైతు కాశప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి పశువులను పొలంలోని కొట్టంలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లగా లేగ దూడ రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉంది. దీంతో కాశప్ప పక్క రైతులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. చిరుత దాడి చంపేసి ఉంటుందని వారు తెలిపారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని రైతులు కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అచ్చంపేటటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండల పరిధిలోని పుల్జాల గ్రామంలో గురువారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పునుంతలకు చెందిన మధునాగుల భాస్కర్ (40) అనే వ్యక్తి మండల పరిధిలోని పుల్జాల గ్రామంలో 11 కేవీ విద్యుత్ తీగలను సరి చేస్తున్నారు. అందులో భాగంగా తాడూరు ఫీడర్ నుంచి ఎల్‌సీ తీసుకొని విద్యుత్ స్తంభం ఎక్కాడు. కానీ ఎల్‌సీ బంద్ చేయక పోవడంతో విద్యుదాఘాతానికి గురై స్తంభం పై నుంచి కిందపడ్డాడు. తోటి సిబ్బంది అతడిని వెంటనే కల్వకుర్తి లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

దొంగ హామీలతో అధికారం

» రైతుబంధుపై మాటమార్చిన కాంగ్రెస్ » బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి » మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్



మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : దొంగ హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజీమంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. అధికారంలోకి వచ్చి 420 రోజులైనా ఇచ్చిన హామీలను చేయడం లేదన్నారు. హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ గురువారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. అంతకు ముందు మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గడియారం చౌరస్తాలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో ప్రజలను మోసం చేసిందని, పచ్చగా ఉన్న తెలంగాణను భగ్గున మండేలా చేస్తోందని ఆరోపించారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలోనూ ఇదే పరిస్థితి ఉందని, హామీలను అమలు చేయలేక స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించపోతోందన్నారు. మన రాష్ట్రంలోనూ అదే పరిస్థితి ఉందని తెలిపారు. అందుకే పథకాల పేరిట దరఖాస్తులను స్వీకరించే డ్రామాలు ఆడుతున్నారన్నారు. రైతుబంధు విషయంలో ముఖ్యమంత్రి మాట మార్చారన్నారు. అర్ధరాత్రి నుంచి రైతుల ఖాతాల్లో టకీ టకీమని డబ్బులు పడతాయని ఆయన చెప్పినప్పటి నుంచి రైతులు ఫోన్‌లు పట్టుకుని ఎదురు చూస్తు న్నారన్నారు. కానీ నాలుగురోజులైనా టకీ లేదు పికీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ ఎన్నికల్లో తమ పార్టీ నుంచి ఎవరినీ పోటీలో నిలబెట్టబోమని, ఏకగ్రీవం చేసుకోవాలని సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్న తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పల్లీ రైతులు మద్దతు ధర లేక ఆందోళనలు చేస్తున్నారని, ఆటోడ్రైవర్లు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌గౌడ్, కోర మోని నర్సింహులు, గంజి ఎంకన్న, రహమాన్, శివరాజు, కరుణాకర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రవీణ్, జములయ్య, నవకాంత్ పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు వేధింపులు తగవు

» ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల డిమాండ్ » డీఐఈవోకు వినతి



డీఐఈవోకు వినతి పత్రం అంజేస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ బోర్డు వేధింపులు తగవని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లోని ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని, లేకపోతే కేంద్రాలకు అనుమతి ఇవ్వబోమని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు నోటీసులు జారీ చేయడం సరికాదని పేర్కొ న్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాల అసోషియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జలజం రమేష్, పాల మూరు జిల్లా అధ్యక్షుడు విజేత వెంకట్‌రెడ్డి, నాయకులతో కలిసి గురువారం ఇంటర్మీయట్ విద్యాశాఖ జిల్లా అధికారి కౌసర్ జహన్‌కు వినతిపత్రం అందించి సమస్యలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొందరు అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఒక్కో కళాశాలకు లక్ష రూపా యల జరిమానా వేసి, యాజమాన్యాలను మానసిక క్షోభకు గురి చేస్తున్నారన్నారు. అధికారుల వేధింపులు భరించ లేమని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే, విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జహీర్ అక్తర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతిభ వెంకటేశ్వర్ రెడ్డి, విజయ్‌కుమార్, సతీశ్‌రెడ్డి, వెంకట్ రాములు, అంజనే యులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం

» యువకుడి అరెస్టు

అమ్రాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిని అరెస్టు చేసినట్లు అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, పదర మండల కేంద్రానికి చెందిన హరీశ్ అనే యువకుడు అమ్రాబాద్ మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. దీంతో ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. యువకుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

బండలు మీద పడి వ్యక్తి మృతి

కొత్తకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : బండలు మీద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని భూత్పూర్‌కు చెందిన బొంగిన కొండన్న (37) హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఆటోలో బండలు తీసుకొచ్చాడు. వాటిని కిందకు దించుతుండగా, అవి ఒక్కసారిగా మీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తలించినట్లు మాదాపూర్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

న్యూస్ బాక్స్

జోగులాంబ బ్రహ్మోత్సవాలకు మంత్రి సురేఖకు ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ ఈవో పురేంద్రకుమార్, అధికారులు, అర్చకులు సచివాలయంలో గురువారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం అందించారు. ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ అలంపూర్ ఇన్‌చార్జి సంపత్, తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలన అందరి బాధ్యత



రామాపురంలో గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎన్‌ఎంలు

వడ్డేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని ఏఎన్‌ఎంలు అన్నారు. గురువారం వడ్డేపల్లి మండలం రామాపురంలో కుష్ఠువ్యాధి నిర్మూలనపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు గ్రామంలో ప్రజలకు రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం కుష్ఠువ్యాధి నిర్మూలనలకు గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎండీ బన్నుల దౌలత్, ఎండీ అమీనాబి, ఎండీ అనీఫాబేగం, ఎండీ శాలిఫైల్వాన్, రేణుక, చాకలి బ్రహ్మం ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

వడ్డేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వడ్డేపల్లి మండలం జూలేకల్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని స్థాపించేందుకు గురువారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. కులమతాలకు అతీతంగా విగ్రహ ప్రతిష్ఠ ప్రతిఒక్కరూ సహకరించాలని యువజన సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వల్బ మధు, కార్యదర్శి సునీల్, మాజీ అధ్యక్షుడు సంధ్యపోగు రాజు, ఆర్ఎస్‌పీ టీం బైరుగపోగు రవిచందర్, భీముడు, సలహాదారులు తిమ్మరాజు, బైరుపోగు బాస్కర్, కిరణ్‌కుమార్, కొంకల భీమన్న, తిమ్మారెడ్డి, జయశంకర్, గొల్లరాజు, కురువ శేఖర్ ఉన్నారు.

ఆలయానికి పూజా సామగ్రి అందజేత

వడ్డేపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వేదవిజ్ఞాన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాల్లో పూజా సామగ్రిని అందిస్తున్నట్లు సమితి బాధ్యులు తెలిపారు. గురువారం శాంతినగర్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం సమూహంలో గల శివాలయానికి ఇటుకూరి శ్రీనివాసులు ఆలయ అర్చకుడు వినయ్ కౌశల్‌శర్మకు పూజా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో మాణిక్యం, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌శెట్టి, వెంకట్రామరావు, రామచంద్రుడు, గొంగళ్ల రాముడు, మదన్, మద్దిలేటి, మహానంది, పూర్ణిమ, విజయకుమారి, శాంత, రజిత, ఉమాదేవి ఉన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రాములు

గద్వాల, జనవరి30 (ఆంధ్రజ్యోతి): జములమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తుల విడిది ఏర్పాట్ల కోసం ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రాములు ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలలో చెత్తాచెదారం లేకుండా డోజర్లతో చదును చేయించారు. ఆయన వెంట మంగలి వీరేష్, ముసలన్న, నాయకులు ఉన్నారు. మంగళవారం జములమ్మ తల్లి గారి ఊరైన గుర్రంగడ్డ నుంచి అమ్మ వారిని మెట్టినిల్లు జమ్మిచేడుకు చేర్చే కార్యక్రమం ఉంది. 12వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

లబ్ధిదారుల ఇళ్ల పరిశీలన



గార్లపాడులో లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎంపీడీవో కాజామొయినుద్దీన్

రాజోలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు గార్లపాడులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించేందుకు ఎంపీడీవో ఖాజామొయినుద్దీన్ గురువారం గ్రామంలో పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల వివరాలు మాత్రమే యాప్‌లో నమోదు చేశారా? లేక దరఖాస్తు చేయనివారి వివరాలు కూడా నమోదు చేశారా అని పరిశీలించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడి, ఉంటున్నది సొంతఇల్లా.. అద్దె ఇల్లా అంటూ వివరాలను ఆరా తీశారు. కార్యక్రమంలో కార్యదర్శి నారాయణమ్మ ఉన్నారు.

యువత గాంధీ అడుగుజాడల్లో నడవాలి



గద్వాల చింతలపేటలో గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, నాయకులు



గద్వాలలోని గాంధీచౌక్ వద్ద గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత, నాయకులు

» గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి
» జిల్లా వ్యాప్తంగా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళి

గద్వాల సర్కిల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మగాంధీని ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నేటి యువత నడవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం గద్వాల పుర పరిధిలోని చింతలపేటలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళి అర్పించారు. గాంధీ ఆశయ సాధనలో నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శనీయుడు

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల సర్కిల్: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంలో కీలకంగా వ్యవహరించిన గాంధీజీ అందరికీ ఆదర్శనీయుడని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సరిత అన్నారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కేశవ్, నాయకులు ఉన్నారు.

వర్గీకరణ ఫలాలు అందరికీ అందాలి

గద్వాల న్యూటౌన్: ఎస్సీ మాదిగ ఉపకులాల ప్రజలకు వర్గీకరణ ఫలాలు అందేవరకు సంపూర్ణ మద్దతు ఇస్తానని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగబోయే లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు సన్నాహక కళాప్రదర్శన విజయవంతానికి తనవంతు మద్దతుగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎమ్మార్పీఎస్ నాయకులకు డప్పులు అందజేశారు. కార్యక్రమంలో బోయ వెంకట్రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేష్, రామన్‌గౌడ్, రాజశేఖర్, నాయకులు ఉన్నారు.

● ఎర్రవల్లి: గాంధీ వర్ధంతి సందర్భంగా ఎర్రవల్లి మండలం కొదండాపురంలో గురువారం కాంగ్రెస్ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నూతన ఎంపీడీవో సాయిద్‌ఖాన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్, మాజీ సర్పంచ్‌లు మధునాయుడు, సుంకన్న, సీనియర్ నాయకులు భాస్కర్, రాజు, హుసేన్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

పెద్దపాడులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ధరూరు : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అన్నివర్గాలపై ఉందని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. అన్నివర్గాల ప్రజలకు సమాన అవకాశాలు సృష్టించిన ఘనత అంబేడ్కర్‌దే అన్నారు. గురువారం రాత్రి ధరూరు మండలం పెద్దపాడులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.

కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రమేష్‌నాయుడు, మాజీ సర్పంచు విజయ్‌భాస్కర్ రెడ్డి, రాఘవేంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, భగీరథ వంశీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా

● గద్వాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా

గద్వాల టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా పలురంగాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్‌కలందర్ బాషా అన్నారు. ఈక్రమంలో విద్యార్థులు వివిన్న సంస్థల్లో ఉద్యోగ అవకాశాలకు ఎలా ఎంపిక చేసుకునే విధానంలో అవగాహన పెంపొందించుకోవచ్చని తెలిపారు. స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జి సెంటర్(టీఎస్‌కేసీ), రసాయనశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్, నియోలాండ్ ల్యాబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌లో రిక్రూట్‌మెంట్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లాలో లైఫ్ సైన్స్ చదువుతున్న విద్యార్థులు జాబ్ డ్రైవ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఎంఎస్ఎన్, నియోలాండ్ ల్యాబొరేటరీ సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి హెచ్ఆర్‌లు సుబ్రహ్మణ్యం, సతీష్ హాజరై 150మంది విద్యార్థులకు నైపుణ్యాలపై పరీక్షలు నిర్వహించి ఇంటర్వ్యూలు చేశారు. అనంతరం ప్రతిభ కనబరచిన 50మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చంద్రమోహన్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ రాధిక, టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ సత్యమ్మ, మెంటార్ సుబ్రహ్మణ్యం, కళాశాల సూపరింటెండెంట్, అధ్యాపకులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

- ఏఎంవీఐ సైదా



ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల డ్రాయింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మానవపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అసిస్టెంట్ మోటర్ ఇన్‌స్పెక్టర్ సైదా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ అంశాలపై డ్రాయింగ్, ముగ్గుల పోటీ నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ఆర్టీఏ అధికారులు మాట్లాడుతూ వాహనాలను నిర్దేశించిన వేగంతో నడపాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు నడపరాదు. బైక్స్ నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఎంవీఐ అమృత వర్షిణి, కానిస్టేబుల్ కిష్టకుమార్‌రెడ్డి, హోమ్‌గార్డు అబ్దుల్ ఖాదర్, సిబ్బంది ఉమేష్ పాఠశాల అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా శ్రమిస్తేనే విజయం



క్రీడాకారుల జర్సీని విడుదల చేస్తున్న డీకే స్నిగ్ధారెడ్డి

● బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి

గద్వాల అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆడటం వల్ల ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేందుకు దోహద పడతాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియంలో గుంటి చెన్నకేశవ స్వామి జాతర సందర్భంగా బండల పాండు యూత్ ఆధ్వర్యంలో 33, 34వ వార్డు కుంటవీధి ప్రీమియర్ లీగ్ సీజన్-1 క్రికెట్ పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ క్రీడలుఆడటం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో రాణించి వారి జట్టు విజయానికి దోహద పడేలా కృషిచేయాలన్నారు. ఆటలో 11మంది క్రీడాకారులు రాణిస్తేనే విజయం తమ సొంతమవుతుందన్నారు. అనంతరం క్రికెట్ జట్ల జర్సీలను ఆమె విడుదల చేసి పోటీలను ప్రారంభించారు. 33, 34వ వార్డుల జట్లు కేఎస్ ఈవెంట్ హాల్ జట్టు, బండల ఎలెవన్, పీటీఎస్ ఫాంటర్స్, సంస్కార్ స్కూల్, లడ్డు లయన్స్, కేఎన్‌బి ట్రావెల్స్ టీంలు మొత్తం ఆరు జట్లు పాల్గొంటున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ కేశవ్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి, బీజేపీ నాయకులు బండల వెంకట్రాములు, దేవదాసు, గీతారెడ్డి, బండల పాండు, తరుణ్, లడ్డు, రాజు, మణి, రామకృష్ణ, నవీన్, మహేష్, విజయ్ ఉన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యం అవసరం

- జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక

కేటీదొడ్డి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యం అవసరమని జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని కొండాపురం, పాతపాలెం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 9,10వ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకై కెరీర్ గైడెన్స్, మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి పాస్ అవ్వడానికి పాటించాల్సిన మెళకువలను వివరించారు. విద్యార్థులు పరీక్షల సమయంలో బయపడకుండా రోజువారీగా ఉపాధ్యాయులు నిర్వహించే పరీక్షలకు హాజరైతే ప్రధాన పరీక్షల్లో సులభతరమవుతుందన్నారు. పాఠశాలల్లో నాణ్యతతో కూడిన ఆహారం, విద్యను విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కొండాపురంలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల అవసరాల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎస్సై శ్రీనివాసులు, ఎంఈవో వెంకటేశ్వర్లతో కలిసి ఎంప్లాయిమెంట్ అధికారి డా.ప్రియాంక, డీసీపీవో నర్సింహులు ప్రారంభించారు.

వేరుశనగ రైతులకు కనీస మద్దతు ధర అమలు చేయాలి

● బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్

గద్వాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యధికంగా వేరుశనగ పండించే రైతులకు కనీస మద్దతు ధర అమలు చేయాలి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కురువ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డును పార్టీ నాయకులతో కలిసి విజయ్‌కుమార్ సందర్శించారు. పంటను వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువస్తే యార్డు అధికారులు మాత్రం రైతులకు కనీస మద్దతు ధర తెలుపకుండా అధికార పార్టీ నాయకులు, దళారులతో కలిసి మోసం చేస్తున్నారని ఆరోపించారు. కమీషన్ ఏజెంట్లతో కుమ్మక్కై రైతులకు నష్టం కలిగించి వారి పొట్టకొడుతున్నారని అన్నారు. వేరుశనకు కనీస మద్దతు ధర రూ.6,783 ఉండగా, మార్కెట్‌లో మాత్రం అతి తక్కువ ఎంఎస్‌పీ కంటే తక్కువ ధరకు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతుల పక్షాన పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాసు హనుమంతునాయుడు, ప్రతాప్‌రెడ్డి, మోనేష్, దానం, అనంతపురం, బీచుపల్లి, రేలంగి, నరసింహులు, రాము ఉన్నారు.



గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

420 సీఎంగా చరిత్రలో నిలవడం ఖాయం

గద్వాల సర్కిల్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గెలిచాక అమలుచేయడంలో విఫలమైన రేవంత్‌రెడ్డి 420 సీఎంగా చరిత్రలో నిలవడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ కురువ విజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. బూటకపు హామీలను నిరసిస్తూ గురువారం జిల్లా నేత బాసు హనుమంతునాయుడు, నా యకులతో కలిసి జిల్లాకేంద్రంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రైతుబంధు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ తదితర పథకాల పేరిట ప్రజలను మోసం చేస్తామంటే ఊరుకోబోమని, ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోనేష్, శేఖర్‌నాయుడు, మక్బుల్, బీచుపల్లి పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



కలెక్టరేట్‌లో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

● కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఆశయం మేరకు కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి, అమరవీరుల స్మారక దినోత్సవంలో భాగంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ ఆశయాల మేరకు కుష్ఠు బాధితులకు వివక్ష లేకుండా ప్రేమతో సేవ చేయాలని, సమాజంలో అవగాహన పెంచాలన్నారు. మహాత్మాగాంధీ ఆశయాలను గౌరవిస్తూ, కుష్ఠువ్యాధి బాధితులకు మద్దతుగా, వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయడానికి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, జిల్లా వైద్యాధికారి సిద్దప్ప, ఏవో వీరభద్రప్ప, అధికారులు ఉన్నారు.

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఫిబ్రవరి 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెప్పారు. గురువారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలన కోసం పిల్లలందరికీ ఆల్బెండజోల్ 400ఎం.జీ మాత్రలను వేయించాలన్నారు. 1-19 సంవత్సరాల చిన్నారులు 1.62 లక్షల మంది జిల్లాలో ఉన్నారని, వారందరికీ మాత్రలు వేయించాలన్నారు. పరిశుభ్రత పాటించకపోవడం వల్లనే నులిపురుగులు వస్తాయని, కావున హైజీన్ పాటించడం ఎంతో అవసరమన్నారు. ఈమాత్రలను పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయాలన్నారు. అనంతరం శిశుమరణాలపై సమీక్ష నిర్వహించి మరణాలకు గల కారణాలను విశ్లేషణను పరిశీలించారు. ధరూర్, గట్టు, క్యాతూర్ ప్రాంతాలలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి ఈ మూడు ప్రాంతాలలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. శిశు మరణాలను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టి నివేదికను స్పష్టంగా సమర్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సిద్దప్ప, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, అధికారులు ఉన్నారు.

కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలంపాట పూర్తి

● ప్రభుత్వానికి రూ. 3,46 లక్షల ఆదాయం



వేలంపాటకు ఉంచిన వాహనాలు

గద్వాలక్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆయా కేసులలో, పోలీసుల తనిఖీలో పట్టుబడి ఎవరూ గుర్తించలేని వాహనాలకు జిల్లా ఎస్పీతో పాటు సభ్యులుగా ఉన్న కమిటీ సమక్షంలో గురువారం 73(స్కాబ్) వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాయుధ దళ కార్యాలయ ఆవరణంలో గురువారం నిర్వహించిన వాహనాల వేలంలో హైదరాబాద్‌కు చెందిన బిడ్డర్ జహీర్ అత్యధికంగా రూ.3.46 లక్షలకు వేలంపాడి వాహనాలను దక్కించకున్నారు. ఈ వేలంలో గద్వాలతో పాటు హైదరాబాద్, మహబూబ్‌నగర్, కర్నూల్, వనపర్తికి చెందిన 30మంది బిడ్డర్స్ పాల్గొన్నారు.

అమరులకు నివాళి

దేశ స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన మహనీయులను స్మరిస్తూ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో సతీష్‌కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగేందర్, సిబ్బంది ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

● జిల్లా సంక్షేమాధికారి సునంద

గద్వాలక్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ కోసం పరీక్షలు చేయించుకోవడం చట్టరీత్యా నేరమని జిల్లా సంక్షేమశాఖ అధికారి సునంద అన్నారు. గురువారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారిక కేంద్రంలో బేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి, బిడ్డ ఆరోగ్య సమస్యల కోసం పరీక్ష చేయించుకోవాలి. కానీ లింగనిర్ధారణ కోసం పరీక్షలు చేయించుకోవద్దన్నారు. అలాగే పీసీపీఎన్‌డీటీ చట్టంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారిత కేంద్ర సమన్వయకర్త జ్యోత్స్న, సఖి సెంటర్ సిబ్బంది శోభ, జిల్లా బాలలసంరక్షణ విభాగం సురేష్, చైల్డ్‌లైన్ దస్తగిరి ఉన్నారు.

నయాబ్ తహసీల్దార్‌కు సన్మానం



ప్రశాంత్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు, ఏవో విజయ్‌కుమార్

గద్వాల అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతిపై వెళుతున్న నయాబ్ తహసీల్దార్ ప్రశాంత్ గౌడ్‌ను గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఏవో విజయ్‌కుమార్, సిబ్బంది సన్మానించి వీడ్కోలు పలికారు. గద్వాల ఆర్డీవో కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్ గౌడ్ పదోన్నతిపై గద్వాల డిస్ట్రిక్ సివిల్ సప్లయ్ కార్యాలయానికి నయాబ్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

అర్హులందరికీ 'సంక్షేమం' అందాలి

- ఎమ్మెల్యే విజయుడు

అలంపూరుచౌరస్తా, జనవరి30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకాలు అర్హులంద రికీ ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రభుత్వం ప్రజాగ్రహం చవిచూడక తప్పదని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఈసందర్భంగా ఆయన గురువారం కర్నూలు నగరంలోని చల్లా బంగ్లాలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పలువురు లబ్ధిదారులకు అందజేశారు. వడ్డేపల్లి, రాజోలి, మానవపాడు మండలాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పరమేశ్వర్ రెడ్డి, కిషోర్, శ్రీహరి, షబ్బీర్, శేఖర్, నాగేశ్వర రావు తదితరులు ఉన్నారు.

మట్టి తవ్వకాలపై ఎస్పీకి ఫిర్యాదు

గట్టు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలోని ప్రభుత్వ ఎర్రగట్టులో అక్రమంగా చేపట్టిన మట్టి తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలంటూ చిన్నోనిపల్లి పునారావాస గ్రామ ప్రజలు ఎల్. సిరెడ్డి, రాఘవేంద్ర, కే. వీరేష్, శివన్న గౌడు, తదితరులు గురువారం ఎస్పీ శ్రీనివాస్ రావుకు ఫిర్యాదుచేశారు. ఈ విషయం గురించి అధికారులకు తెలిపినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదని తెలిపారు. నిత్యం ట్రాక్టర్ల శబ్దంతో పాటు దుమ్ముధూళితో పునరావాస ప్రజలు అవస్థలు పడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

నిరంతరం విద్యుత్ అందించడమే లక్ష్యం

● జిల్లా నోడల్ అధికారి భాస్కర్

గద్వాలఅర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యమని జిల్లా నోడల్ అధికారి భాస్కర్ అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో మూడు సబ్ డివిజన్లు, అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ జిల్లా మొత్తం క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రానున్న వేసవిలో విద్యుత్ వినియోగదారులకు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లో ఓల్టేజీ సమస్యలు గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు.

వేసవిలో విద్యుత్ వినియోగం జిల్లాలో ఇరవైశాతం అదనంగా పెరిగే అవకాశం ఉన్నందున, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లను, కొత్త విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుపతి రావు, ఏడీ, ఏడీఈలు, ఏఈలు ఉన్నారు.

దీక్ష వీడి చర్చకు రండి

- పెద్దధన్వాడలో రైతులను కోరిన సీఐ, తహసీల్దార్
- గ్రామంలోనే చర్చించాలని పట్టుబట్టిన రైతులు

రాజోలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దధన్వాడ శివారులో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు విషయమై దీక్ష వీడాలని, జిల్లా అధికారుల సమక్షంలో గద్వాలలో ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడాలని అధికారులు కోరారు. గురువారం పెద్దధన్వాడలో రిలే నిరాహార దీక్ష శిబిరానికి వెళ్లి, దీక్షలో కూర్చున్న రైతులు, ఆయా గ్రామాల ప్రజలతో శాంతినగర్ సీఐ టాటాబాబు, రాజోలి తహసీల్దార్ పి.రామ్మోహన్ మాట్లాడారు. దీనికి ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు స్పందిస్తూ ఫ్యాక్టరీ నిర్మాణంపై చర్చించాలనుకుంటే ప్రజల సమక్షంలోనే చర్చించాలని, 13 గ్రామాల ప్రజలు, తాము జిల్లా కేంద్రానికి రాలేమని తేల్చి చెప్పారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లారు. కాగా రైతుల దీక్షలు గురువారం 8వ రోజుకు చేరాయి.